# బుజ్జిగాడి బొమ్మ

అమ్మలో ముడుచుకొని వెచ్చగా పడుకొని వున్న నేను హఠాత్తుగా నెట్టినట్లవడంతో ఉలిక్కిపడ్డాను.

అమ్మ గొంతులోంచి వస్తున్న శబ్దాలు నేను ఇంతకు మునుపు ఎరిగినవి కావు. హృదయవిదారకమైన ఆమె మూలుగులు నన్ను కలవరపెట్టాయి.

ఇంతలో ఎవరో నన్ను బలవంతంగా అమ్మ నుంచి దూరంగా నెట్టేసారు. మృదువైన రెండు చేతులు నన్ను ఒడుపుగా పట్టుకొన్నాయి. అమ్మగొంతు వినిపించలేదు. అమ్మ కోసం వెతుకుదామని మెల్లిగా కళ్ళు తెరిచాను.

అదే మొదటిసారి నేను కళ్ళు తెరవడం!

విపరీతమైన వెలుగు!

గబుక్కున కళ్ళు మూసుకొన్నాను.

ముక్కుకు ఏదో అడ్డం పడ్డట్లు ఉక్కిరిబిక్కిరి అయ్యింది. నాకు ఊతనిచ్చిన చేతులు ఏదో మెత్తని దాంతో నన్ను శుభ్రంగా తుడిచాయి. ఆకస్మాత్తుగా నన్ను తలకిందులుగా చేసి, వీపు తట్టాయి.

రక్తం అంతా తలలోకి ఉరకలు పెట్టినట్లయింది. కంగారుగా కెవ్వుమన్నాను.

''కంగ్రాచ్యులేషన్స్! చక్కటి బాబు!'' అమ్మతో కాబోలు అంటూ ఆమె నన్ను ఇంకొకావిడకి అందించింది.

ఈ చేతులు మొదటావిడంత నాజూగ్గా, మెత్తగా లేవు. అయితే ఏమి నన్ను గోరువెచ్చని నీళ్ళల్లో జలకాలాడించాయి.

అమ్మ గొంతు వినబడింది. ఆవిడతో ఆనందంగా ఏదో చెబుతోంది.

తృప్తిగా కళ్ళు మూసుకొని, నా వెచ్చని ఊలుబట్టల్లోకి నేను ఒదిగిపోయాను.

★ ★ ★

సమీర్ మా కుటుంబంలోకి ఓ చిన్నారిని ఆహ్వానించే ఆలోచనను నాముందు వుంచినపుడు - నాలో ఎన్నో భయాలు, అనుమానాలు తలెత్తాయి.

అంతకు ముందే తల్లి అయిన నా స్నేహితురాలొకరు ఆ క్రమంలో నేను అనుభవించాల్సిన శారీరకశ్రమను, మానసిక వత్తిడిని గూర్చి వర్ణించి వివరించింది.

ఆ విషయాలన్నీ సమీర్‌తో చర్చించాలని నాకు ఎంతో ఉబలాటంగా ఉండేది. అయితే, సమీర్ వృత్తి అతనికి ఇదొక సహజ పరిణామంగా పరిగణించడం నేర్పింది. అతను నా సందేహాలకు, సంశయాలకు తేలిగ్గా నవ్వేసి ఊరుకొనేవాడు.

నాలో కదులుతున్న ప్రాణితో నాలుగడుగులు వేయాలన్న ఆలోచనే నాకు వచ్చేది కాదు. ఆ చిన్న కదలికల్ని అంచనాలు వేయడంలోనే నా ఊహాలు నిండిపోయేవి. నా సమయాన్ని పూర్తిగా అందుకే వినియోగించే దానిని.

అందుకు భిన్నంగా - సమీర్ నన్ను జబ్బుమనిషిలా మంచంలో పడి వున్నావని వెక్కిరించేవాడు. నన్ను లేచి, చలాకీగా అన్ని పనులు చేయమని బలవంతపెట్టేవాడు. పైపెచ్చు, యాంటీనాటల్ ఎక్సర్‌సైజ్‌లు అంటూ ఏవేవో వ్యాయామాలు రోజుకో కొత్తరకం నాకు నేర్పేప్రయత్నం చేసేవాడు. నేను వాటన్నిటినీ సక్రమంగా చేస్తానో లేదోనని తనే స్వయంగా పర్యవేక్షించేవాడు. నాకు ఒక్కోసారి కోపం ముంచుకొచ్చేది.

సమీర్ ఇంత నిర్దయగా ఎలా ప్రవర్తించగలుగుతున్నాడు? నామీదా, నా అనుభూతుల మీదా సమీర్‌కు ఆసక్తి, శ్రద్ధ హఠాత్తుగా తగ్గిపోయాయా? నా యిష్టాయిష్టాల ప్రమేయం అతనికి అక్కర్లేదా?

అయితే, నా కోపం ఏడుపులా కరిగిపోయేది. విషాదంలా మిగిలిపోయేది. నేను లేడీడాక్టర్‌తో సమీర్ వింతప్రవర్తనను గూర్చి చర్చించాలని ప్రయత్నించాను.

ఆమె నవ్వి ఇలా అంది, ''మమ్మల్ని ఇరకాటంలో పడేసే పేషెంట్లు ఎవరో తెలుసా? డాక్టర్లు - వాటి కుటుంబ సభ్యులు!''

ఆవిడ సమాధానం నాకు ఏ మాత్రం తృప్తిని కలిగించలేదు.

చివరకు నేను ఉత్కంఠతో ఎదురు చూసిన రోజు రానే వచ్చింది.

సమీర్ నన్ను స్వయంగా ఆసుపత్రికి తీసుకెళ్ళాడు. డాక్టర్ నాకొక విశాలమైన గదిని కేటాయించింది. ఆవిడ గదిలోకే వచ్చి, పరీక్ష చేసి, ఏవో ఇంజక్షన్లు చేసి వెళ్ళింది. సమీర్ నా చేత టీ తాగించి, మంచం మీద నుంచి కిందికి దిగమన్నాడు. నాచేతిని పట్టుకొని నెమ్మదిగా అటూ ఇటూ నడిపించాడు. ఎన్ని సార్లో నాకే జ్ఞాపకం లేదు.

ఎంత కఠిన పాషాణం! ఈ స్థితిలో కూడా తనకు తోచినట్లుగా నన్నుండమంటాడే!

వెన్నులోంచి పొత్తి కడుపులోకి నొప్పి ఓ విద్యుత్ అలలా చురుగ్గా కదిలింది.

ఆ విషయం సమీర్‌కి చెప్పాను. సమీర్ తొణకలేదు. పైగా, నా చేతికి వాచ్ ఇచ్చి, ఎంత వ్యవధిలో ఆ నొప్పి వస్తుందో గమనించి చెప్పమన్నాడు.

నేను ఇంతగా బాధ పడుతోంటే, తను ఇంత నింపాదిగా ఎలా వుండగలుగుతున్నాడు? ఆకస్మాత్తుగా ఈ ప్రపంచంలో నేను ఒంటరి దాన్నయి పోయినట్లనిపించింది.

ఆ విషాదంలోంచి తేరుకొనే లోపలే నేను డెలివరీ రూం లో వున్నాను.

నా చుట్టూ వున్న డాక్టరు, నర్సులు చకచక తమ పని తాముచేస్తున్నారు. వారి కదలికల్లోని క్రమశిక్షణ నా దృష్టిని దాటిపోలేదు.

ఒక్కో నొప్పి నన్ను మృత్యుముఖంలోకి తోస్తున్నట్లు అనిపించేది, నొప్పి తగ్గుముఖం పట్టిన మరుక్షణం విపరీతమైన నిద్రముంచుకొచ్చేది, నొప్పినొప్పికీ మధ్య నేను అప్రయత్నంగానే కౌంట్‌డౌన్‌లు, బ్రీతింగ్ ఎక్సర్‌సైజ్‌లు చేస్తున్నాను.

ఆ నొప్పులు నేను ఆలోచించేంత, అనుభూతించేంత వ్యవధిలేనంత వేగంగా రావడం మొదలయ్యాయి. హఠాత్తుగా గాఢాంధకారం నన్ను ముంచేసినట్లు అనిపించింది. నాచుట్టూ వున్న ఆకారాలు కూడా అంత హఠాత్తుగానే మాయమయ్యాయి. ఈ లోకంతో సంబంధం తెగిపోయినట్లనిపించింది!

నన్ను ఈ లోకంలోకి లాక్కొచ్చిన మొదటి కంఠం కప్పుగిరేలా ఏడుస్తున్న చిన్నారిది!

''కంగ్రాచ్యులేషన్స్! చక్కటి బాబు!'' డాక్టర్ నాభుజం తట్టి, నవ్వుతూ అంది.

''థ్యాంక్యూ'' మనస్ఫూర్తిగా చెప్పాను.

బాబును స్నానం చేయించడానికి నర్స్ తీసుకెళ్ళింది.

''మీ వలన నా స్టేట్‌మెంట్ వెనక్కి తీసుకోవలసి వస్తోంది'' డాక్టర్ ఆగింది. ఏ స్టేట్‌మెంటో నాకు అర్థం కాలేదు.

''డాక్టర్లు, వారి కుటుంబ సభ్యులు ఇరకాటంలో పెట్టే పేషెంట్లు మాత్రమే కారు... కో-ఆపరేట్ చేయగల పేషెంట్లు కూడా అని! మీ కో-ఆపరేషన్ వలన ప్రసవం సులభమయింది. మిమ్మల్ని అందుకు సిద్ధం చేసిన సమీర్‌ని అభినందించాలి ముందు!'' ఆవిడ నవ్వుతూ బయటకు వెళ్ళింది.

ఇప్పుడు డాక్టర్ సులభమని వర్ణించినది సులభమేనా? కష్టంగా లేదూ? ఏమో? సమీర్ ఇన్నాళ్ళూ కఠినంగా వ్యవహరించకపోతే ఇంకా కష్టంగా వుండేదేమో!

సమీర్ పట్ల కృతజ్ఞతో, గౌరవమో, అభిమానమో లేక అన్నీ కలసిన అనుభూతో నన్ను చుట్టు ముట్టుంది. నా విషాదం పలుచబడింది. నా నిర్లిప్తత నీరసపడింది.

ఉత్సాహంగా సమీర్ కోసం ఎదురుచూడసాగాను.

★ ★ ★

నన్ను చూడడానికి మొదట వచ్చింది మా నాన్న.

ఆయన గొంతు ఇంతకు మునుపు విన్నాను గానీ చూడడం ఇదే మొదలు. నా వెచ్చని దుస్తుల్లో ముడుచుకొని వున్న నన్ను, ఆయన గభాల్న పైకి లాగాడు. అమ్మలా సున్నితంగా లేని ఆయన చేతులు మొదటిసారిగా నన్ను బలంగా ఎత్తాయి. నా మెడ వెనక్కి పడిపోయింది. నేను బిత్తరపోయి ఏడుపు లంకించుకొన్నాను. నాభయంలో నాన్న బట్టలు తడిపేసాను.

''అమ్మో! వీడు అసాధ్యుడే! వీడిని నీవే చూసుకో!'' అంటూ నన్ను అమ్మ చేతుల్లోకి వేగంగా పడేసాడు నాన్న.

అమ్మ నన్ను పక్కన పడుకోబెట్టి - ముసిముసి నవ్వులు నవ్వుతూ - ఆయన చొక్కా మార్చుకోవడానికి సాయం చేస్తోంది. నా తడిసిన బట్టలు మార్చడం మానేసి ఆయనతో నవ్వుతూ, నింపాదిగా కబుర్లాడుతూ వుంటే నాకు కోపం వచ్చింది.

కళ్ళు గట్టిగా మూసుకొని, పిడికిళ్ళు బిగించి, నోరంతా తెరిచి - పెద్దగా అరిచాను.

''అదుగో. నా శత్రువు అప్పుడే నామీద యుద్ధం ప్రకటించేసాడు. వెళ్ళు. ముందు వాడిపని చూడు'' అన్నాడు నాన్న చిరునవ్వుతో.

ఇప్పుడు నాన్న నాకు నచ్చాడు. అమ్మ అదేనవ్వుతో నా బట్టలు మార్చింది.

నేనింత కోపంగా వుంటే వాళ్ళిద్దరికీ ఆ నవ్వెందుకో!

★ ★ ★

సమీర్ లోపలికి రాగానే నర్స్ నెమ్మదిగా తలుపు చేరవేసి వెళ్ళింది.

నేను మెలకువగానే వున్నా కళ్ళు మూసుకొని, వుయ్యాల వైపు తిరిగి పడుకొన్నాను. సమీర్ దగ్గర నుంచి వస్తోన్న ఇంటిమేట్ స్ప్రే పలుచని సువాసన నా ఉత్సాహాన్ని రెండింతలు చేసింది. నేను ఏరికోరి సమీర్ కోసం తెచ్చిన స్ప్రే అది!

ఏదో మధురమైన భావన నన్ను చుట్టేసింది.

సమీర్ నా దగ్గరకి వస్తాడేమోనని అతని పాదాల శబ్దం కోసం చెవులు రిక్కించాను. సమీర్ నేరుగా ఉయ్యాల దగ్గరకు వెళ్ళాడు.

నేను కనురెప్పలు కొద్దిగా ఎత్తి, సమీర్‌నే గమనిస్తూ వున్నాను.

సమీర్ కొద్దిసేపు బాబుని దీక్షగా చూసాడు. తరువాత వాడిని నెమ్మదిగా తన చేతుల్లోకి తీసుకొని బల్లమీద పడుకోబెట్టాడు.

బాబుది మొద్దునిద్రో లేక సమీర్ నైపుణ్యమో కానీ బాబు కదల్లేదు. తన పాటికి తాను నిద్రపోతున్నాడు.

సమీర్ నింపాదిగా బాబు కాళ్ళు, చేతులు అటు వంచీ ఇటువంచీ చూసాడు. తలను తడిమి చూసాడు. పొట్టను వత్తి చూసాడు. కనురెప్పలు లాగి, కళ్ళను తెరిచి చూసాడు.

ఇంతకు ముందు డెలివరీ రూంలో డాక్టర్ కదలికల్లో నేను గమనించిన క్రమశిక్షణే ఇప్పుడు సమీర్‌లోనూ కనిపించింది. నా చిన్నారి బాబును గూర్చి సమీర్ ఏం తీర్మానించబోతున్నాడోనన్న ఉత్కంఠ పెరిగింది.

''నార్మల్ చైల్డ్!'' సమీర్ ఎలాంటి భావమూ వ్యక్తీకరించని కంఠంతో తనలో తను గొణుక్కున్నట్లుగా అన్నాడు.

నా చెవులకు మాత్రం ఆ మాట స్పష్టంగానే వినబడింది!

నేను మంచం మీద దిగ్గున లేచి కూర్చున్నాను. నాకు విపరీతమైన కోపం వచ్చింది. నేనంతగా ఎదురుచూసిన క్షణం ఇదేనా? ఇలాంటి ఉదాసీనతనేనా తను ఆశించింది? నార్మల్ డెలివరీ! నార్మల్ చైల్డ్!!

నా మట్టుకు నాకది ప్రాణంతో చెలగాటమే!

నాబిడ్డ నాకు అపురూపమే!

సమీర్ లోని వ్యక్తికి వృత్తికి మించిన అనుభూతులేమీ వుండవా? వృత్తి బాధ్యతలు వ్యక్తి భావుకతను మాయం చేసేయా? నా ఆలోచనలు నా అదుపు తప్పుతున్నాయి. నా నరాలు చిట్లిపోయేలా వున్నాయి.

సమీర్ ఇంకా నన్ను గమనించినట్లుగా లేడు. ఇంకా ఏం పరీక్ష చేద్దామని అనుకున్నాడో ఏమో బాబును రెండు చేతులతో గబుక్కున పైకి ఎత్తాడు.

బాబు బిత్తరపోయి ఏడుపు లంకించుకున్నాడు. సమీర్ బట్టల్ని తడిపేసాడు. సమీర్ కంగారుగా నా వైపు చేసాడు.

''అమ్మో! వీడు అసాధ్యుడే! వీడి సంగతి నీవే చూసుకో!'' అంటూ బాబుని నా చేతుల్లోకి వేగంగా పడేసాడు.

నా చిట్టి తండ్రి సమీర్‌ని అతని లోకం నుంచి మామూలు లోకంలోకి

లాక్కొచ్చాడు. ఇప్పుడు సమీర్ ఏ కొత్త తంత్రైనా ప్రవర్తించేట్టుగానే ప్రవర్తించాడు.

నా మనసు విజయోత్సాహంతో తేలికయ్యింది. ఆ సంతోషం దాచుకుందామన్నా దాగకుండానా మొహానముసిముసి నవ్వులుగా ప్రత్యక్షమైంది.

నేను అప్రయత్నంగానే సమీర్ చొక్కా మార్చుకోవడానికి సాయం చేయబోయాను - ఇంతలో బాబు తన గులాబీ గుప్పిళ్ళను బిగించి, మొహం జేవురించేలా గట్టిగా అరిచాడు.

''అదుగో, నా శత్రువు అప్పుడే నా మీద యుద్ధం ప్రకటించేసాడు. వెళ్ళు, ముందు వాడి పని చూడు'' అన్నాడు సమీర్ చిరునవ్వుతో.

నిజంగా చిట్టితండ్రి సమీర్‌ని నా పక్కన చూసి అసూయ పడుతున్నాడా? ఏమో? ఎవరికి తెలుసు పసివాడి మనసు?

ఏది ఏమైనా తల్లి పాత్రలోకి నాకు తెలియకుండానే నేను ఇమిడిపోయాను. ఇంతకు మునుపు నాలో తలెత్తిన అనుమానాలకు, భయాలకు తావు లేకుండానే

సహజ పరిణామం అంటే ఇదే కాబోలు!

★ ★ ★

నన్ను చూడడానికి ఎవరెవరో వస్తున్నారు.

సన్నటి వాళ్ళు, గుండ్రటి వాళ్ళు, పొడుగువాళ్ళు, పొట్టివాళ్ళు, బొంగురు గొంతు వాళ్ళు, చక్కటి గొంతు వాళ్ళు.

అమ్మ దగ్గర నుంచి నన్ను లాక్కొని, మొహంలో మొహం పెట్టి, ఏవేవో మాట్లాడేసి వెళుతున్నారు.

నేనిపుడిపుడే కూర్చుని అందర్నీ గమనించగలుతున్నాను. నాకు నచ్చిన వాళ్ళను చూడగానే నవ్వుతున్నాను. బవిరిగడ్డం బాబాయి వస్తే మాత్రం అమ్మ చీర కుచ్చిళ్ళలో దాక్కొంటాను. అయినా, ఆయన నాకోసం ఇల్లంతా తిరిగే బొమ్మలు బోలెడు తెచ్చాడు. అందుకే ఆయనంటే నాకు ఇష్టం.

నాన్న నాకోసం ఎన్నెన్నో మెత్తటి బొమ్మలు తెచ్చాడు. అమ్మ చేతులంత మెత్తటివి! అమ్మా, మామ్మా, ఒక్కోసారి నాన్న నా పక్కన కూర్చుని ఆడిస్తారు. నన్ను వాటిని ముట్టుకోనివ్వరు. మామ్మ ఆడిపించడం అవగానే బొమ్మల్ని పైన షోకేస్‌లో దాచేస్తుంది. నాకు అందనంత ఎత్తులో!

ఓ రోజు ఆ కోపంతో ఏడ్చాను. నా కుందేలుని విసిరి కొట్టాను. దాని

బొజ్జ కొద్దిగా తెరుచుకుంది. కాసేపు ఆశ్చర్యంగా, కాసేపు భయంగా దాని వంకే చూస్తూ కూర్చున్నాను. అది కదల్లేదు. మెదల్లేదు.

అది నా బుజ్జి కుందేలే! బొజ్జ విచ్చుకొని ముచ్చటగా వుంది.

దానిని నా వళ్ళోకి తీసుకొన్నాను. మెత్తటి దూదిని కొద్ది కొద్దిగా బయటకు లాగాను. నా వళ్ళూ నామంచం... అంతా దూది. తెల్లగా, మంచులా ఎగురుతోంది.

దానిని పట్టుకోవడానికి ముందుకు జరిగాను. అందుకోవడానికి వంగే లోపలే మంచం మీద నుంచి గచ్చు మీదకు బోర్లాపడ్డాను.

అమ్మ, మామ్మ పరిగెత్తుకొంటూ వచ్చారు.

నా నుదుటి మీద నా 'బఫూన్' ముక్కుకు మల్లే, ఎర్రగా, గుండ్రంగా ఉబ్బింది. రోజూ దానిని నిమురుకోడానికి భలే తమాషాగా వుండేదిలే!

అయితే, అప్పటినుంచీ నా మీద మామ్మ నిఘా ఎక్కువయి పోయింది.

నేను బొమ్మల్ని పాడు చేసేస్తానని ఎప్పుడూ చెప్తుతుంది.

నా బొమ్మలతో నన్ను సంతోషంగా ఆడుకోనివ్వరేం - వీళ్ళందరూ?

★ ★ ★

బాబును చూడడానికి ఎవరెవరో వస్తున్నారు. అంతకుమునుపు నాకు పరిచయం లేని వాళ్ళు కూడా నన్ను కలిసి బాబు వివరాలు కుతూహలంగా అడుగుతున్నారు. నా ఆరోగ్యం గూర్చి ఆరా తీస్తున్నారు.

వారిలో కొందరు నన్ను ఇంతకు ముందు - గర్భిణిగా వున్నపుడు సూపర్‌మార్కెట్‌లోనో, పండ్ల దుకాణాల వద్దో చూసిన వారు కాగా, మరికొందరు సమీర్ నన్ను వాకింగ్‌కు తీసుకెళ్ళినపుడు తటస్తపడిన వారు. ఇక బంధువుల, స్నేహితుల సంగతి సరేసరి!

వచ్చిన వాళ్ళు బాబుని వళ్ళోకి తీసుకొని, మొహంలో మొహం పెట్టి పోలికల కోసం వెతుకుతున్నారు. నా చిట్టి తండ్రిలో నేను గమనించని విషయాలెన్నో నాకు చూపి వెళుతున్నారు. ఆ క్రమంలో వాళ్ళు బాబులో ఏదో ఓ అంశాన్ని మెచ్చుకొనేవారు.

వాళ్ళలా అంటూ వుంటే నా మనసు గర్వంతో ఉప్పొంగేది. పైకి మాత్రం గంభీరంగా, "ఆ... ఏదో లెద్దూ! ఎంతయినా వాడిని బుర్రముక్కు!" అంటూ వారి మాటల్ని కొట్టి పారేసేదానిని.

సమీర్ బంధువులంతా బాబు అచ్చం చిన్నప్పటి సమీర్ అంటే, మా బంధువులంతా అచ్చుపోసినట్లు నా పోలికే నేవారు.

నామట్టుకు నాకు బాబు సమీర్‌లా నొసలు ముడివేయడం స్పష్టంగా తెలుస్తోంది. సమీర్ లాగానే తన బుల్లి నోరంతా తెరిచి గట్టిగా శబ్దం చేస్తూ ఆవులిస్తాడు కూడాను!

బాబు కోపం కూడా సమీర్ లాగానే ముక్కు మీదే వుంటుంది.

ఆకలయితే అరనిమిషం ఓపిక పట్టడు. కళ్ళు గట్టిగా మూసుకొని - కాళ్ళు నిగడతన్ని, పిడికిళ్ళు బిగించి, గుక్కపట్టి ఏడుస్తాడు. ఆ చిన్ని కంఠంలోంచి అంత శబ్దం ఎలా పుడుతుందో!

నేను కంగారుగా పాలు తాగించబోతాను. ఆత్రంగా తాగబోయి గబగబ గుటకలు వేస్తాడు. ఆ తొందరకి పొలమారి, ఉక్కిరిబిక్కిరి అయిపోతాడు. మళ్ళీ క్షణంలో తనే సర్దుకొని, తన కార్యక్రమం కొనసాగించుతాడు. గుక్కెడు పాలు తాగుతాడో లేదో, తల వెనక్కు వంచి శాంతంగా...తృప్తిగా...నిట్టూర్చుతాడు. ఆ వెనకే చిన్న త్రేన్పు!

తృప్తి అనే పదానికి అర్థం నాకు ఆ క్షణంలోనే అర్థమయింది. ఇంత వరకు ఎవరూ వర్ణించని, వర్ణించలేని ఓ స్వచ్ఛమైన భావ ప్రకటన అది!

పెద్దవాడయ్యాక వాడిలో ఆ భావాన్ని నేనూ, సమీర్ ఏ అంశంలోనైనా చూడగలమా? బహుశా తల్లిదండ్రులు తమ పిల్లలలో తిరిగి ఆ భావాన్ని చూడాలనే ఆశతోనే జీవితాంతం వారి కోసం అంతలా తాపత్రయ పడతారేమో!

రేపటి సంగతి ఎలా వున్నా, ఇప్పటి కపటం ఎరుగని బాబు మృదువైన ప్రపంచంలో వాడిలో ఆ భావాన్ని కలిగించగల శక్తి నాకొక్కదానికే వున్నదన్న సంగతి నాకెంతో సంతోషాన్ని కలిగిస్తుంది. కొంచెం గర్వాన్ని కూడా!

బాబు పోలికల విషయంలో ఎవరి దృష్టికీ రాని అంశాన్ని ఒకదానిని నేను గమనించాను. వాడి కళ్ళు నా కళ్ళ మాదిరే ముదురు తేనెరంగువి. బాబు నాకేసి చూసినపుడల్లా ఏదో వింత అనుభూతి నన్ను వివశురాలిని చేస్తోంది.

అయితే, అందరిలో వింత ప్రవర్తన సమీర్‌దే! మేమందరం ఈ విషయాలన్నిటినీ ఉత్సాహంగా చర్చిస్తూ, సందడి చేస్తుంటే - తను మాత్రం మొహాన నవ్వొకటి తగిలించుకొని మౌనంగా మమ్మల్ని చూస్తూ కూర్చునే వాడు.

అలాంటప్పుడు సమీర్ మొదట్లో అన్నమాట నా చెవుల్లో ప్రతిధ్వనించేది. నార్మల్ చైల్డ్! నార్మల్ చైల్డ్!!

నిజానికి, సమీర్ పసివాడిని ఆడించడంలో, నవ్వించడంలో, సముదాయించడంలో చూపే నేర్పు నాలో అసూయ రగిలించేది. నేను ఏదో ముఖ్యమైన పని వున్నట్లు, వెంటనే బాబును సమీర్ దగ్గర నుంచి లాక్కెళ్ళే దానిని.

రోజురోజుకీ, పూటపూటకీ బాబులో వేగంగా వస్తున్న మార్పులు నాకెంతో ఆనందం కలిగిస్తున్నాయి. వాడిలోని ఈ మార్పులకు మూలకారణం నేనేనన్న విషయం నేను ఒక్క క్షణం కూడా మరవలేదు.

బాబు తన సౌమ్యమైన, రమ్యమైన ప్రపంచంలోకి నాకు తెలియకుండానే నన్ను లాక్కెళ్ళాడు. నిజానికి నా ప్రపంచమే వాడయిపోయాడు. నా కోపతాపాలు, భావావేశాలు వాడి నిర్మలమైన, అమాయకమైన చేష్టల ముందు తలవంచాయి. ఆశ్చర్యంగా, సమీర్ కూడా నా కళ్ళకి ఓ అమాయకమైన పసివాడిలాగానే తోచడం మొదలు పెట్టాడు!

అయితే, సమీర్ నాపట్లా, బాబుపట్లా నిరంకుశంగా ప్రవర్తించే అంశం ఒకటి వుందని త్వరలోనే తెలిసింది.

అది అక్కయ్య బాబుకోసం వెండి గిలక్కాయ తెచ్చినపుడు!

సమీర్ చాలా ఘోరటుగా ఆ గిలక్కాయను బాబు చేతిలోనుంచి లాక్కొని దూరంగా గిరాటేసాడు. నా మనస్సు చివుక్కుమంది. అక్కదానికోసం ఎన్ని కొట్లుతిరిగిందో, ఎంత మోజుపడి కొందో నాకు అంతకుముందే వివరించింది. దానికున్న గజ్జెలు గులుకు గులుకు మంటూ ఎంత ముచ్చటగా వున్నాయో!

సమీర్‌కు ఆ గజ్జెల్ని చూసే కోపం వచ్చింది. అవి బాబుకు హాని చేస్తాయట!

సమీర్ ఆగడం అంతటితో ఆగలేదు.

బుజ్జిగాడికి బహుమతులుగా వచ్చిన బొమ్మలన్నిటినీ పరిశీలించి చూసేవాడు. రివాల్వర్‌లు, గన్‌లు, ట్యాంకర్‌లు, బాణాలు ఇలాంటివన్నీ కట్టకట్టి, అటక మీద పడేయించాడు. అవి హింసాప్రవృత్తిని పెంచుతాయట!

ప్రతి బొమ్మలో ఏదో ఓ లోపం చూసేవాడు. కొంగముక్కు కొనదేలి వుందన్నాడు. ఏనుగు దంతాలు పొడుచుకు వచ్చాయన్నాడు. విమానం పైని జెండాకర్రని పీకే సాడు. చివరకు వాళ్ళతమ్ముడు ఎంతో ముచ్చటపడి తెచ్చిన బొమ్మలకు కూడా అదేగతి.

''అయినా, ఆడుకోవడానికి వాడికి మనం, మనకి వాడూ వుండగా.. ఈ బొమ్మలన్నీ ఎందుకు?'' అంటూ నన్ను ప్రశ్నించాడు.

అయితే, అలా అంటూనే తనే స్వయంగా ఎన్నో బొమ్మలు తెచ్చాడు. మెత్తటి దూది కూరిన జంతువులు, బంతులు ఇలాంటివే అన్నీను!

బుజ్జిగాడి బొమ్మల విషయంలో తన పంతమే నెగ్గించుకోవాలని పట్టుబట్టే ఓ మొండి పిల్లాడిలా ప్రవర్తించాడు నవీన్.

సమీర్ ప్రవర్తన నాకేమీ నచ్చలేదు.

సమీర్‌ది మరీ విచిత్రం కాకపోతే, పసివాడి బొమ్మల మీద మన ఆజమాయిషీ ఏమిటి? వున్న బొమ్మల్ని పక్కన పడేసి, మళ్ళీ కొనుక్కురావడమేమిటి? పిచ్చి కాకపోతే!

అయితే, ఏమూలో నాకు పిల్లల విషయంలో సమీర్ తప్పుగా ప్రవర్తించడనే వుంది. ఎందుకంటే ఎంతోమంది తల్లులు తమ కన్నబిడ్డల విషయంలో సమీర్ మీద భరోసా వుంచుతున్నారు. సమీర్ మీద వాళ్ళు కున్న నమ్మకం, అభిమానం నాకు లేవా? అయినా నేను సమీర్‌ని ఎప్పుడైనా ఆ దృష్టితో చూసానా? లోలోపల సమీర్ శాస్త్రజ్ఞానం నాబిడ్డకూ ఉపయోగపడాలనివున్నా, పసివాడు ముక్కు ఎగబీలిస్తే కంగారు పడే ఓ సామాన్య తండ్రిలా సమీర్ ప్రవర్తించాలని నా బలమైన కోరిక.

పిల్లవాడు మరీ తుంటరివాడు. సమీర్ తెచ్చిన కుందేలు బొమ్మను అంతం చూసేదాకా వదల్లేదు. ఆ ప్రయత్నంలో తన తలకు బొప్పి కట్టించుకున్నాడు.

కప్పెగిరేలా వాడు గుక్కపట్టి ఏడుస్తోంటే, నా ప్రాణం విలవిలలాడి పోయింది. ఆ రోజు సమీర్ ఇంటికి రాగానే గొడవ పెట్టుకొన్నాను. అంతా తను తెచ్చిన బొమ్మవల్లే జరిగిందని.

సమీర్ చలించలేదు. పైపెచ్చు, 'మందు రాస్తే తగ్గిపోయేదానికి అంత రాద్ధాంతం అనవసరం' అంటూ ఓ స్టేట్‌మెంట్ ఇచ్చాడు.

అప్పటి నుంచీ సమీర్ తెచ్చిన బొమ్మల పట్ల నాకు అయిష్టత మరింత పెరిగింది.

ఆ కోపంలో సమీర్‌ను బయటకు పోనిచ్చి, ఇన్నాళ్ళు దాచి వుంచిన బొమ్మలన్నిటినీ బయటకు తీసాను. అత్తయ్య నాకు వత్తాసు పలికింది. సమీర్‌కు నచ్చని పని చేయడంలో ఆవిడ అండ దొరకడంతో నాకు మరింత ధైర్యం వచ్చింది.

రోజూ ఆ బొమ్మల్ని బయటకు తీసి ఆడించడం నా పని. సమీర్ వచ్చేలోగా తిరిగి వాటిని దాచడం ఆవిడ పని.

అప్పటి నుండే నా మీదా, సమీర్ మీదా మౌనం పెత్తనం చలాయించడం

మొదలు పెట్టింది. అయితే, సమీర్‌కు నాకూ మధ్య ఏర్పడ్డ స్తబ్దత తగ్గేరోజు త్వరలోనే వచ్చింది. అది వాసు అన్నయ్య అమెరికా నుండి త్వరలో వస్తున్నానని ఫోన్ చేయడంతో, అన్నయ్య సమీర్‌కు ప్రాణస్నేహితుడు కూడా!

అన్నయ్యకు స్వాగతసన్నాహాలు చెప్పడంలో సమీర్ మునుపటి ఉత్సాహం చూపించాడు.

చాలాకాలం తరువాత అన్నయ్యను, అందులోనూ అమెరికన్‌శ్రీమతితో వస్తోన్న అన్నయ్యను కలవాలని నాకూ ఎంతో కుతూహలంగా వుంది.

ఆ ఆనందక్షణాల కోసం ఎదురుచూస్తుండగానే, వాళ్ళు వచ్చే రోజు రానే వచ్చింది.

★ ★ ★

ఈ రోజు ఎందుకనో పొద్దుటే ఇల్లంతా సర్దేస్తున్నాను. అమ్మ కొత్తగలీబులు, కర్టెన్లు వేస్తోంది. మామ్మ బొమ్మలు శుభ్రం చేస్తోంది. వంటింట్లోంచి మంచి వాసనలు వస్తున్నాయి. నాకు కొత్త డ్రస్ వేసారు. అందరూ హడావుడిగా లోపలికి, బయటకి తిరుగుతున్నారు. నేను ఈ ఏర్పాట్లన్నిటినీ ఆసక్తితోచూస్తున్నాను.

ఇపుడు నేను ఎంత దూరమైనా నా చేతులమీదా, మోకాళ్ళ మీదా పాకి వెళ్ళగలను. అమ్మ నన్ను పట్టుకోవడానికి పరిగెత్తాల్సి వస్తోంది.

ఇంతలో నాన్నతో పాటు ఓ అంకుల్, ఆంటీ వచ్చారు. వాళ్ళు రాగానే నవ్వులతో గట్టిమాటలతో ఇల్లు హోరెత్తిపోయింది. నన్నెవరూ గమనించడం లేదని, నేను తలుపు చాటునుంచి లొ౽ి చేసాను.

ఆ ఆంటీ అమ్మలా లేదు. భుజాల మీంచి జుట్టు వేలాడుతోంది. నా ''బార్బీ'' లా గౌను వేసుకొంది. పెదాలు ఎర్రగా, నా ''బఫూన్'' ముక్కులా వున్నాయి.

ఆంటీ గభాల్న వచ్చి నన్ను ఎత్తుకుంది. ఆమె నుంచి వచ్చే మంచి వాసన నాకెంతో నచ్చింది. అంకుల్ నన్ను తన దగ్గరకు రమ్మని పిలిచాడు. ఈల వేసాడు. నన్ను ఆకర్షించడానికి వింత వింత చేష్టలు చేసాడు. అయినా, నేను ఆంటీని వదలకుండా గట్టిగా పట్టుకొన్నాను. అందరూ ఫక్కుమన్నారు. నేనూ పకపక నవ్వాను.

అంకుల్ బ్యాగులోంచి ఏవేవో తీసి అందరికీ ఇస్తున్నాడు. నాన్నకు ఇచ్చిన సీసాలోంచి ఆంటీ దగ్గర వస్తోన్న మంచి వాసన వస్తోంది. చివరగా బ్యాగులోంచి అమ్మ జడలాంటి పొడవాటి బొమ్మను బయటకు తీసాడు.

గోధుమ రంగులో తళతళమెరుస్తోన్న ఆ తాడులాంటి బొమ్మ కళ్ళు మిలమిల మెరుస్తున్నాయి!

ఆయన ఏదో తిప్పి నేల మీద వదిలాడు.

అది మెలికలు తిరుగుతూ-జర్రున జారుతూ హాలంతా పాకింది, నాకంటే వేగంగా! దాని నోట్లోంచి దారం లాంటిదేదో బయటకు వచ్చి వెళుతోంది.

''అమ్మో! అచ్చం పాములానే వుందే!'' అంది అమ్మ కళ్ళు పెద్దవి చేసి, గుండెల మీద చేయి వేసుకొని.

నేనిలాంటి బొమ్మను ఇంతకు ముందెపుడూ చూడలేదు. దాని కళ్ళు, దాని రంగు, దాని నోట్లోని దారం - అన్నీ నాకు నచ్చాయి. ఆంటీ వళ్ళోంచి క్రిందికి దూకాను.

నాన్న అమ్మ వైపు చూసి ఏదో సైగ చేసాడు. అమ్మ మామ్మ వైపు చూసింది. నేను ఆ బొమ్మను ముట్టుకొనే లోపలే మామ్మ, ''వీడి చేతికి ఇచ్చామంటే అంతే సంగతులు! మొన్న కుందేలు బొమ్మనేం చేసాడు! అందులోనూ ఇది ఇక్కడ దొరికేదా? పెట్టేదా?'' అంటూ షోకేస్‌లో పైన పెట్టేసింది.

ఈ మామ్మ ఎప్పుడూ ఇంతే!

'' ఏం వాసూ, ఈ సారైనా ఇండియాలో ఓ నెలరోజులు వుంటారా?'' అంటూ నాన్న అడిగే సరికి, మళ్ళీ అందరూ మాటల్లో పడ్డారు.

నేను షోకేస్ వైపు చూసాను. ఆ బొమ్మ నన్ను ఊరిస్తూ తలను ఊగిస్తోంది!

అమ్మ వైపు చూసాను. అమ్మ నన్ను పట్టించుకోవడమే లేదు. ఇక నాన్న, మామ్మల సంగతి సరేసరి!

బొమ్మ వైపు ఆశగా చూసాను. ఊహూ...లాభం లేదు.

నేను కోపంతో మెల్లిగా పాక్కుంటూ, హాల్లోంచి లాన్‌లోకి వెళ్ళి కూర్చున్నాను. పచ్చగడ్డిని గుప్పిటతో లాగి, నోట్లో పెట్టుకొన్నాను. తియ్యగా వుంది. మళ్ళీమళ్ళీ లాగుతూ కూర్చున్నాను. ఇంతలో నా పక్కన ఏదో శబ్దమయింది. అటుతిరిగాను.

ఇందాక వాళ్ళు నాకోసం తెచ్చిన పాము బొమ్మ నా వెనకే వుంది!

అంకుల్ నన్ను మాలిమి చేసుకోవడానికి వెనగ్గా వచ్చి పెట్టినట్లున్నాడు. నాకోపం మాయమయింది.

కొద్దిసేపు అలానే కదలకుండా కూర్చున్నాను.

ఆ గోధుమ రంగు ఆకారం కొంచెం ముందుకు వచ్చింది.

నేను ఆనందంగా నవ్వుకొన్నాను. రెండు చేతులతో దానిని గట్టిగా పట్టుకొన్నాను.

దాని తల నాన్న అరచేయంత వుంది! మామ్మ పెట్టుకొనే కళ్ళద్దాలు పెట్టుకొంది! దాని నోట్లోంచి దారం లాంటిది బయటకు వచ్చింది.

నేను ముద్దు పెట్టుకుందామని వంగాను. అంతకంటే వేగంగా ఆ బొమ్మ నా మొహం మీదా, చేతుల మీదా గట్టిగా ముద్దుపెట్టుకొంది!

కానీ అది వయిద్దలా లేదు. బాబాయి బవిరిగడ్డం గుచ్చుకొన్నట్లుగా...కాదు...కాదు... ఇంకా నొప్పిగా వుంది చురుక్కు మంటోంది.

హాలు అద్దాల్లోంచి అమ్మ, నాన్న, అందరూ కన్పిస్తున్నారు. నేను అమ్మని పిలుద్దామని నోరు తెరిచాను.

ఇంతలో అమ్మ సోఫాలోంచి లేచి అటూ ఇటూ చూసింది. తప్పకుండా నాకోసమే అయివుంటుంది!

నా నోట్లోంచి తెల్లగా...అమ్మ నాకు స్నానం చేయించేపుడు రుద్దే సబ్బు నురగలా నురగ వచ్చింది. ఆ నురగ మెల్లగా నా బుగ్గల మీద నుంచి...గడ్డం మీదకి జారుతూ...గుండెల మీద పడుతోంది.

నా కళ్ళు మూసుకుపోతోంటే, నెమ్మదిగా ఆ పచ్చటి, మెత్తటి గడ్డిపైకి ఒదిగాను. ఇంతలో అమ్మ పరిగెత్తుకొంటూ వచ్చి, నాచేతుల్లో కదులుతూ వున్న ఆ కొత్త బొమ్మను బలంగా లాగి, దూరంగా విసిరేసింది. నన్ను గబుక్కున తన వళ్ళోకి తీసుకొంటూ, నా చెవులు చిల్లులు పడేలా కేకేసింది.

''సమీర్! బాబు...పాము...పామును పట్టుకొని వున్నాడు!''

ఆపై నాకు ఏ మాటలు వినిపించలేదు.

నేను కళ్ళు తెరిచే సరికి అమ్మ నా మొహంలోకి ఆత్రంగా చూస్తోంది, అమ్మ జుట్టు రేగి, కళ్ళు వుబ్బి ఏదోలా వుంది.

''సమీర్! బాబు కళ్ళు తెరిచాడు!'' అమ్మ గొణుగుతున్నట్లుగా అంది.

నాన్న నాదగ్గరకి వచ్చి, నా వంక కన్నార్పకుండా చూసి, సున్నితంగా నవ్వాడు.

అమ్మ కూడా – కళ్ళు తుడుచుకుంటూ...అలవోకగా నవ్వింది.

నేనూ పలకరింపుగా నవ్వాను.

నాన్న అమ్మ భుజం తట్టి, నా పక్కన ఓ బొమ్మను పెట్టాడు.

నేను పాడుచేసేనని మామ్మ ఎప్పుడూ దెప్పుతుందే...అదే ఆ బొమ్మ! నా ప్రియమైన...బుజ్జికుందేలు బొమ్మ! ❁

(విపుల–జనవరి, 1997)